## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- 36.436 గ్రాములు గంజాయి కాల్చివేత

నిషేధిత గంజాయిని కాల్చివేస్తున్న పోలీస్ అధికారులు

తెలంగాణ చౌక్, జూన్ 11: యువతవ మత్తు పదార్థాలకు అలవాటు పడి అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని రగుడు వద్ద డంప్ యార్డ్‌లో 36 కిలోల 436 గ్రాముల గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో కాల్చి వేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 41 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని కాల్చివేసినట్లు వెల్లడించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను పోలీస్‌లు సమర్థవంతంగా నిరోధిస్తున్నట్లు తెలిపారు. గంజాయిని అక్రమంగా రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ యాదగిరి, సీఐ రఘుపతి, సిబ్బంది ఉన్నారు.

## 'సరస్వతి' పాఠశాల గుర్తింపు రద్దు

సిరిసిల్ల రూరల్, జూన్ 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాల తరగతుల నిర్వహణ అనుమతులు రద్దు చేస్తున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల భవనంలో ఫైర్ సెఫ్టీ నిర్వహణపై పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో చర్యలు తీసుకున్నారు. పాఠశాలలో నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు అనుమతులు రద్దు చేశారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈవోను ఆదేశిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

## 'మైనర్లకు వాహనాలిస్తే కేసు నమోదు'

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదుట వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో వాహనాలు నడుపుతున్న మైనర్లపై దృష్టి పెట్టారు. నంబర్‌ప్లేట్ లేని, లైసెన్సులేని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఇక్కడ ఎస్ఐ రమాకాంత్, తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్, జూన్ 11 : మండల కేంద్రంలో ఏఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం తనిఖీలు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ప్రమాదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల నివారణకు వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

## యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ రూరల్/ కోనరావుపేట, జూన్ 11: యువత ఈనెల 13న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. నిమ్మపల్లి గ్రామంలో పోలీస్ మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమాశంలో మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు వారి చదువులో ఉత్తీర్ణత బట్టి 60 కంపెనీల్లో ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి పక్కదారి తొక్కకుండా ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇక్కడ చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఆంజనేయులు, నేతలు ప్రతాప రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మన సాహితీ శిఖరం.. సినారె

- మట్టి పరిమళానికి చిహ్నం
- మారుమూల గ్రామం నుంచి మహోన్నత స్థాయికి ఎదిగిన సినారె
- విద్యార్థి దశ నుంచే జాలువారిన కవితలు
- ఎల్లలు దాటిన రచనలతో ఎన్నో పురస్కారాలు
- విశ్వంభర కావ్యానికి ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ్ అవార్డు
- 3500 సినీ గేయాలు, 170 పుస్తకాల రచన
- నేడు ఏడో వర్ధంతి

**తెలుగు సాహిత్యంలో చెరిగిపోని సంతకం. సాహితీ సముద్రం డాక్టర్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి. మారుమూల పల్లెలో పుట్టి దేశంలోని అత్యుత్తమ జ్ఞానపీఠ అవార్డును అందుకున్న అసామాన్యుడు. సినీ పరిశ్రమకు అనన్యమైన పాటలు అందించి తెలంగాణ ఖ్యాతిని చాటిన మహాకవి. ఎల్లలు దాటిన రచనలతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఆయన, సాహితీలోకానికి దూరమై నేటితో ఏడేండ్లు. బుధవారం ఆయన ఏడో వర్ధంతి సందర్భంగా నమస్తే అందిస్తున్న ప్రత్యేక కథనమిది.**

**- వేములవాడ, జూన్ 11**

స్వగ్రామంలో అభివృద్ధి కార్యక్రమంలో మాట్లాడుతున్న సినారె (ఫైల్)

వేములవాడ, జూన్ 11: వేములవాడ మండలం మారుమూల పల్లె హన్మాజీపేటలో సింగిరెడ్డి మల్లారెడ్డి, బుచ్చమ్మ దంపతులకు 1931 జూలై 29న నారాయణరెడ్డి జన్మించారు. స్థానిక పాఠశాలలోనే నాలుగో తరగతి వరకు చదువుకున్నారు. మాధ్యమిక విద్య సిరిసిల్లలో, ఉన్నత విద్య కరీంనగర్‌లో అభ్యసించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోనే ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. అక్కడే ఉస్మానియాలో తెలుగు సాహిత్యంలో పీజీ చేసి, డాక్టరేట్‌ను కూడా పొందారు. చిన్ననాటి నుంచే గ్రామాల్లో హరికథలు, జానపదాలు, జంగం కథల వైపు ఆకర్షితుడై సాహితీ రంగంలోకి అడుగు పెట్టిన ఆయన, అంచలంచెలుగా ఎదిగారు. వివిధ ఉద్యోగాల్లో రాణిస్తూనే నారాయణరెడ్డి కవిగా తన ప్రస్థానాన్ని కొన సాగించారు. అనేక కవితలు, పద్య, గేయ, ముక్త కావ్యాలు, గత్య కృతులు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపాలు, బుర్రకథలు, గజళ్లు, వ్యాసాలు, విమర్శనా గ్రంథాలు, నాటకాలు, అనువాదాలే కాకుండా వేలాది సినీగీతాలను రాశారు. మరుగున పడిన గజళ్లను కొత్త ప్రక్రియలో తిరిగి అందించారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ, మలయాళం, ఉర్దూ, కన్నడం, మొదలైన భాషల్లోకి రచనలను అను వదించారు. హిందీ, ఉర్దూ భాషల్లో కూడా స్వయంగా కవితలు అల్లారు. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయిలండ్, మలేషియా, మారిషస్, యుగోస్లేవియా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలను కూడా సందర్శించారు. 1990లో యుగోస్లేవియాలోని స్త్రుగాలో జరిగిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలోనూ భారతీయ భాషా ప్రతినిధిగా కూడా పాల్గొన్నారు.

హన్మాజీపేటలో సినారె నిర్మించిన కమ్యూనిటీ భవనం

### పాటకు పట్టాభిషేకం..

సినారె సినీ పరిశ్రమలో కూడా తనదైన ముద్రవేశారు. 1962లో 'గులేబకావళి కథ' చిత్రంలో 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ' అనే పాటతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2009లో అరుంధతి చిత్రంలోని 'జేజెమ్మ.. జేజెమ్మ' వరకు దాదాపు 3500 గీతాలను అందించారు. నాలుగు దశాబ్దాలపాటు తన పాటలతో సినీ జగత్తును ఉర్రూతలూగించి పాటంటే ఇలా ఉండాలని చాటి చెప్పారు. మొగుడా పెళ్లామా, తూర్పు పడమర చిత్రాల్లోనూ నటుడిగా మెరిశారు. పలు చిత్రాలకు రచయితగానూ పనిచేశారు.

### పురస్కారాలు.. పదవులు..

ఎల్లలు దాటి రచనలో తనకంటూ గుర్తింపు సాధించిన సినారె, ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. విశ్వంభర పద్య కావ్యానికి దేశంలో అత్యున్నత జ్ఞానపీఠ్ పురస్కారాన్ని 1988లో పొందారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ, భారతీయ భాషా పరిషత్తు, రాజలక్ష్మి, సోవియట్– నెహ్రూ, అసాన్, పద్మశ్రీ, పద్మభూషన్ పురస్కారాలతోపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో డాక్టరేట్, ఉత్తమ పాటల రచయితగా అనేక అవార్డులు అందుకున్నారు. సికింద్రాబాద్ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో, నిజాం కళాశాలలో అధ్యాపకుడిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ ప్రొఫెసర్‌గా, విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా, ఆంధ్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుడి గా, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా ఏడేళ్ల పాటు పనిచేశారు. రాజ్యసభ సభ్యుడిగాను ఆరేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. కాగా, పుట్టిన మట్టిని, పెరిగిన గడ్డను మరవని సినారె, స్వగ్రామం హన్మాజీపేటలోనూ ఎనలేని సేవలందించారు. ఏకంగా ఆయన నివాసాన్ని గ్రంథాలయంగా మార్చి 2వేల పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. పాఠశాల నిర్మాణానికి కూడా తన ఎకరం స్థలాన్ని ఉచితంగా అందజేశారు. కాగా, 2017 జూన్ 12న తుది శ్వాస విడిచారు. మారుమూల గ్రామంలో పుట్టి సాహితి శిఖరంగా గొప్ప పేరు ప్రఖ్యాతలు గాంచిన సినారెది నేడు ఏడో వర్ధంతి.

### నేడు హన్మాజీపేటలో కవితా గాన నీరాజనం

సి.నారాయణ రెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా బుధవారం హన్మాజీపేటలో కవితా గాన నీరాజనం నిర్వహిస్తున్నట్లు సుశీల నారాయణ రెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి చెన్నయ్య తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సంకశాల మల్లేశం, కవులు, గాయకులు హాజరవుతారని తెలిపారు.

## కల్వర్టు నిర్మాణానికి చర్యలు

ఐదో వార్డులో మురుగు కాలువ కల్వర్టును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, జూన్ 11: జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో మురుగు కాలువపై కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 5, 18వ వార్డుల పరిధిలోని మురుగు కాలువను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, మాట్లాడారు. నెహ్రూనగర్, గాంధీనగర్, అంబేద్కర్‌నగర్, శాంతినగర్‌లో మీదుగా ప్రవహించే మురుగు కాలువలో పేరుకుపోయిన సిల్టుతో మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి ప్రధాన మురుగు కాలువకు అనుసంధానంగా కల్వర్టుల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఫుట్‌పాత్ కింద పట్టణ ప్రధాన మురుగు కాలువల్లో సిల్టు తొలగింపు పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఇక్కడ మున్సిపల్ కౌన్సిలర్ దార్నం అరుణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

## పాలిటెక్నిక్ కోర్సుతో ఉద్యోగావకాశాలు

- పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజగోపాల్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజగోపాల్

రాజన్న సిరిసిల్ల, జూన్ (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్ కోర్సుతో అపార ఉద్యోగ అవకాశాలుంటాయని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ అన్నారు. జీవితంలో తొందరగా స్థిరపడాలనుకునే వారికి ఈ కోర్సుచేస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. పద్మశాలీ ప్రొఫెషనల్ అఫిషియల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో మంగళవారం కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ ర్యాంకర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎంచుకునే కోర్స్ ఎంపికతోనే ఉద్యోగాలు కీలకం అవుతాయన్నారు. టెక్స్‌టైల్స్ డిప్లొమా అధ్యాపకులు ప్రభాకర చారి మాట్లాడుతూ, టెక్స్‌టైల్ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పోపా జిల్లా కార్యదర్శి పున్నం చందర్, మండల విద్యాధికారి రఘుపతి, ప్రతినిధులు గాజుల ప్రతాప్, మచ్చ ఆనంద్, అంకారపు జ్ఞానోభా, వాసాల హరిప్రసాద్, కనుకుంట్ల తిరుమల, కోడం శ్రీనివాస్, దేవత ప్రభాకర్, దాసు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు సైన్ బోర్డులు ఏర్పాటు చేయండి

- గ్రామంలో స్ట్రీట్ లైట్లు పెట్టించండి
- కలెక్టర్‌కు ఎంపీటీసీ ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు

తంగళ్లపల్లి–మండేపల్లి రోడ్డులో ప్రమాదకరమైన మూలమలుపును పరిశీలిస్తున్న ఎంపీపీ మానస, అధికారులు

సిరిసిల్ల రూరల్, జూన్ 11: ప్రజావాణిలో తంగళ్లపల్లి ఎంపీటీసీ బుస్స స్వప్న–లింగం దంపతుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ అనురాగ్ జయంతి స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో తంగళ్లపల్లి మండలం మండేపల్లి ఎంపీటీసీ బుస్స స్వప్న–లింగం దంపతులు గ్రామ సమస్యలపై ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో తంగళ్లపల్లి–మండేపల్లి రోడ్డులోని రాజప్రఫుల్లారెడ్డి ఫంక్షన్ హాలు సమీపంలోని మూలమలుపు ప్రమాదకరంగా మారిందని, ఇప్పటివరకు 8 మంది మృతి చెందారని కలెక్టర్‌కు వివరించారు. వెంటనే మూలమలుపు వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, తంగళ్లపల్లి నుంచి మండేపల్లి, మండేపల్లి నుంచి కేసీఆర్ నగర్ వరకు రోడ్డుకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని స్వయంగా వినతి పత్రం అందించారు. కలెక్టర్ అనురాగ్ తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం మండేపల్లిలో ఆర్అండ్‌బీ, సెస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. ఎంపీపీ పడిగెల మానస, ఎంపీటీసీ బుస్స స్వప్నతో కలిసి ప్రమాదకరమైన మూలమలుపును పరిశీలించారు. అదే విధంగా స్ట్రీట్‌లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా పనులు చేపట్టాలని అధికారులను కోరారు. వీరిలో బీఆర్ఎస్ నేతలు పడిగెల రాజు, బుస్స లింగం, అధికారులున్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

సిరిసిల్ల రూరల్, జూన్ 11: ఐటీఐలో మొదటి విడుత ఆడ్మిషన్ల కోసం దరఖాస్తుల గడువును ఈనెల 14కు పొడిగించినట్లు సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కనకయ్య తెలిపారు. మొదటి విడుత అడ్మిషన్ల కోసం జూన్ 14లోపు గడువు ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో మొబైల్ నెంబర్‌తో రిజిష్టర్ చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐ సిరిసిల్ల కళాశాలలో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్ వెహికిల్, వెల్డర్, డీఎంసివిల్, మెకానిక్ డీజిల్ ట్రేడ్లలో అవకాశం ఉందని ,అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ భట్టు రోజ, W/o హరిష్, R/o. H.No. 2-63/3, అనంతగిరి గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క ప్లాట్ నెంబరు 442, దీని యొక్క మొత్తం విస్తీర్ణం 250.00 చ.గజాలు, దీని యొక్క సర్వే నెంబరు 496/2, అనంతగిరి గ్రామం, ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజ్యములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 11-06-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

సిరిసిల్ల రూరల్ : బద్దెనపల్లిలో అంగన్‌వాడీ బడి బాటలో జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్, తదితరులు

కోనరావుపేట: ధర్మారంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

# ఊరూరా 'బడిబాట'

- ర్యాలీలు తీసిన ఉపాధ్యాయులు
- ఇంటింటా తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

**జిల్లాలో మంగళవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరూరా ర్యాలీలు తీశారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.**

తెలంగాణ చౌక్, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయుల హరిప్రసాద్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట నిర్వహించారు. ఇక్కడ ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, దేవత ప్రభాకర్, ఎస్ సునీత, కరుణ, తదితరలున్నారు.

సిరిసిల్ల రూరల్, జూన్ 11: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో మంగళవారం అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యం లో బడిబాట కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ బడిబాటలో జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఎలగందుల పరమేశ్వర్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన, చిన్నారుల సంరక్షణ, పోషకాహారం, గ్రోత్ మానటరింగ్‌పై వివరించారు. తల్లులు, గర్భిణీలకు పోషకాహారం, చిన్నారుల ఎదుగుదలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లత, పోచమ్మ, సిబ్బంది ఉన్నారు. బద్దెనపల్లిలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు చంద్రంపేటలో ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను పంచారు.

బోయినపల్లి: బడిబాటలో పాల్గొన్న ఎంపీపీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు

బోయినపల్లి, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. బోయినపల్లిలో ఎంపీపీ వేణుగోపాల్ ఉపాధ్యాయులతో కలిసి ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, నాయకులు సంబ లక్ష్మీరాజం, పాఠశాల హెచ్ఎం కే భూమయ్య, బోయినపల్లి, బూర్గుపల్లి పాఠశాలల హెచ్ఎంలు, తిరుపతి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలున్నారు.

ఇల్లంతకుంట, జూన్ 11 : ఓగులాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటా తిరుగుతూ పిల్లలను చేర్పించాలని తల్లింద్రులకు అవగాహన కల్పించారు. ఇక్కడ ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజయ్య, విద్యార్థులున్నారు.

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: మండల కేంద్రంతోపాటు గుండారంలో ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్కారు బడుల్లో సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

కోనరావుపేట, జూన్ 11: మండలంలోని ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మురళీనాయక్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. చిన్నారులను సర్కారు బడిలో చేర్పించాలని కోరారు.

ముస్తాబాద్ జూన్ 11 : రామలక్ష్మణులపల్లెలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల్లోనే చిన్నారులను చేర్పించాలని ర్యాలీ తీశారు. ఇక్కడ ఆవునూర్ రామలక్ష్మణులపల్లె పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.



తెలంగాణ చౌక్ : నెహ్రూనగర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ముస్తాబాద్ : ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలని రామలక్ష్మణులపల్లెలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



ఇల్లంతకుంట : ఓగులాపూర్ బడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

వేములవాడ, జూన్ 11: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడికి మంగళవారం వేములవాడ మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.33 వేల సాయమందించారు. కోనాయిపల్లికి చెందిన ఏరెళ్లి సాయికుమార్ పది రోజుల క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తమ వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ మన చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మోటూరి మధుసూదన్, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

**వేలం కోసం బహిరంగ ప్రకటన**
**తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ–వేలం కోసం బహిరంగ ప్రకటన**

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (''బంగారు రుణ సౌకర్యం'') తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/ హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా''

తేది:22 జూన్ 2024న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ–వేలం సమయం) ఇ–వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

| క్ర. సం. | బ్రాంచ్ పేరు | రుణ ఖాతా నం. | వినియోగదారు పేరు | బకాయి మొత్తం | డిమాండ్ నోటీస్ తేది | స్థూల బరువు | నికర బరువు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | కోరుట్ల సి2387 టిజి | XXXXXXXXXXX3060 | కుందనగిరి నిఖిల్ కుమార్ | 49388.63 | 15–మార్చి–24 | 13.5 | 12.2 |
| 2 | సిరిసిల్ల KRN టిజి | XXXXXXXXXXX0786 | సిరిసిల్ల KRN టిజి | 49319 | 15–మార్చి–24 | 13.5 | 11.8 |
| 3 | పెద్దపల్లి | XXXXXXXXXXX1167 | యెల్లంకి ఆకాష్ | 132690 | 04–మే–24 | 32.9 | 31.3 |
| 4 | రామగుండం | XXXXXXXXXXX7779 | పిన్నోజు వంశీ | 56978 | 04–మే–24 | 13.4 | 13.1 |
| 5 | కరీంనగర్ | XXXXXXXXXXX7084 | కూకట్ల మహేష్ | 91306 | 04–మే–24 | 22.7 | 22.2 |

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య (సమయం) నిర్వహించబడును.

సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను. అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

## అందుబాటులో కార్యాలయాల నిర్మాణం

రుద్రంగి, జూన్ 11: మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం రుద్రంగిలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలను జడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇక్కడ నాయకులు చెలుకల తిరుపతి, కొమురె శంకర్, ఎర్రం గంగనర్సయ్య, నారాయణ, పల్లి గంగాధర్, యాదయ్య, లింగం, ఆర్ఐ నవీన్‌లున్నారు.

## బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, జూన్ 11: మామిడిపల్లిలో యువకుడు బడుగు కిరణ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు 1998–99వ సంవత్సరంలో కిరణ్‌తో కలిసి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.22 వేల ఆర్థిక సహాయం అందజేశారు. దాతలు ఆదుకోవాలని కోరారు. ఇక్కడ విద్యార్థులు గుమ్మడి మురళి, భాస్కర్, కిరణ్, మాధవి, మమత, రజిత, స్వప్న తదితరులున్నారు.

## ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

ముస్తాబాద్, జూన్ 11 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు తల్లిదండ్రులను కోరారు. మంగళవారం పోతుగల్, ముస్తాబాద్ గ్రామాల్లో గంభీరావుపేట అధ్యాపకులు ఇంటింటా తిరిగారు. గంభీరావుపేటని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సౌకర్యాలు విద్య బోధన, గతంలో వచ్చిన ఫలితాలు విద్యార్థులకు తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాక ధర్మపురి, కే.వీ.భిక్షమయ్య, శ్రీనివాస్, మనోహర్, విజయ్, మహేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

## నలుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఇరు వర్గాలు పబ్లిక్‌లో గొడవపడి న్యూసెన్సు చేసినందుకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద రెండు వర్గాలు గొడవ పడుతున్నారనే సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ వెళ్లాడు. ఈ క్రమంలో రాజన్నపేటకు చెందిన నమిలికొండ బాలయ్య, నమిలికొండ రాజవ్వ అదే గ్రామానికి చెందిన నమిలికొండ పర్శయ్య, నమిలికొండ నిర్మల గొడవపడుతున్నారు. ఒకరిపై మరొకరు దాడులు చేసుకోగా వద్దని వారించినా వినలేదు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

## సేంద్రియ సాగుపై అవగాహన

వేములవాడ రూరల్, జూన్ 11: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలోని రైతు వేదికలో సేంద్రియ వ్యవసాయ సాగు, అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగుపై వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సేంద్రియ సాగు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు వల్ల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. శాస్త్రవేత్తల బృందంతో చర్చాగోష్టి నిర్వహించారు. ఇక్కడ ఏఈవో సందీప్, రైతులు, అధికారులున్నారు.